ఈఎస్ఐ దవాఖానలకు .. కిరాయిలను విడుదల చేయాలి

హిమాయత్‌నగర్, మే 27 : ఈఎస్ఐ కార్పొరేషన్ పరిధిలో కొనసాగుతున్న 75 దవాఖానలకు బకాయి ఉన్న అద్దె కిరాయిలను విడుదల చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్ సోమవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 6 నెలలుగా అద్దె భవనాల్లో కొనసాగుతున్న దవాఖానలకు రాష్ట్ర ప్రభుత్వం అద్దె చెల్లించక పోవడంతో యజమానులు వైద్యులు, సిబ్బందిని ఇబ్బందులకు గురిచేయడంతో పాటు తాళాలు వేసే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని యాదాద్రి కాలనీలో రోడ్డుకు అడ్డుగా నిర్మించిన ప్రహరీని విజిలెన్స్ అధికారులు సోమవారం కూల్చివేశారు. యాదాద్రి కాలనీలో కొందరు బిల్డర్లు రోడ్డును ఆక్రమించి గోడ నిర్మించడంతో స్థానికులు, వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. స్థానిక నాయకులకు, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోవడంతో హెచ్ఎండీఏ విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు సోమవారం టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి కూల్చివేశారు. దీంతో కాలనీ వాసులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

- బండ్లగూడ

యూనిఫాం పనులు పరిశీలన

బడిపిల్లల యూనిఫాం సిద్ధం చేసే పనులు షురూ అయ్యాయి. సోమవారం యూసుఫ్‌గూడ సర్కిల్‌లో పొదుపు సంఘాల మహిళలు స్టిచింగ్ పనులు ప్రారంభించారు. ఆయా పనులను యూసీడీ డీపీఓ వెంకట కిషన్‌రావు, సీఓ ప్రశాంత్‌తో కలిసి పరిశీలించారు.

- జూబ్లీహిల్స్

నత్తనడకన.. రోడ్ల విస్తరణ పనులు

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- అధికారులు చొరవ తీసుకోవాలి

కంకరపోయి వదిలేసిన పిల్లోనిగూడ – పాలమాకుల రోడ్డు

పూర్తికాని ఎంటేరువాగు బ్రిడ్జి నిర్మాణం పనులు

శంషాబాద్ రూరల్, మే 27 : గత ప్రభుత్వం పంచాయతీరాజ్ రోడ్లను విస్తరించడం కోసం ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం ద్వారా శంషాబాద్ మండలానికి రూ.19 కోట్ల నిధులు కేటాయించి జూలై 22 – 2021లో అప్పటి పంచాయతీరాజ్‌శాఖ మంత్రి దయాకర్‌రావు చేతుల మీదగా పనులకు శంకుస్థాపన చేశారు. నర్కూడ నుంచి చౌదర్‌గూడ మీదగా పెద్దషాపూర్, రాయన్నగూడ నుంచి నానాజీపూర్, పిల్లోనిగూడ మీదగా పాలమాకుల వరకు, ఘాన్సిమియాగూడ నుంచి శంకరాపూర్ వరకు కాచారం నుంచి జూకల్ మీదగా పెద్దషాపూర్ వరకు రోడ్లను విస్తరించే పనులు ప్రారంభించి పనులు చేపట్టారు. అవి నేటికి పూర్తికాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నర్కూడ నుంచి పెద్దషాపూర్ రోడ్డు కిలోమీటర్ మేర ఆగిపోయింది. పెద్దషాపూర్ నుంచి జూకల్ వరకు మాత్రమే పూర్తి అయింది. రాయన్నగూడ నుంచి నానాజీపూర్, పిల్లోనిగూడ మీదగా పాలమాకుల వరకు రోడ్డుపై కంకరపోసి వదిలేయడంతో నిత్యం ప్రయాణికులు క ఇబ్బందులు పడుతున్నారు. పిల్లోనిగూడ వద్ద ఎంటేరువాగులో బ్రిడ్జి నిర్మాణం నిలిచిపోవడంతో రాకపోకలు నిర్వహించే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. దీంతో రోడ్ల పనులు వెంటనే పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. రాయన్నగూడ నానాజీపూర్ రోడ్డు మీదగా శంషాబాద్, మొయినాబాద్ మండలాలకు చెందిన ప్రజలు షాద్‌నగర్ మహబూబ్‌నగర్ ప్రాంతాలకు వెళ్లడం కోసం ఇదే రోడ్డును అధికంగా ఉపయోగిస్తారు. రోడ్డు పనులు నత్తనడకన సాగుతుండడంతో ఇబ్బందులు తప్పడంలేదని పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు చొరవతీసుకొని పనులు త్వరగా పూర్తిచేయాలని కోరుతున్నారు.

త్వరలో పనులు పూర్తి చేస్తాం

వివిధ గ్రామాల రోడ్లకు ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం ద్వారా రూ.19 కోట్ల నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించాం. పిల్లోనిగూడ వద్ద బ్రిడ్జి నిర్మాణం పనులతో పాటు రోడ్డు పనులు కొంత అలస్యమైయ్యాయి. పనులు కొనసాగుతున్నాయి. త్వరలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం.

- పంచాయతీరాజ్, డీఈ సంజీవరెడ్డి

రోడ్డు, బ్రిడ్జి పనులు పూర్తి చేయాలి : జుర్కి రమేశ్, పిల్లోనిగూడ

నాలుగేండ్లుగా కొనసాగుతున్న రోడ్డు, బ్రిడ్జి నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి. వర్షాలు పడితే బ్రిడ్జి పనులు నిలిచిపోతాయి. దీంతో పాటు రోడ్డు పనులు సైతం నిలిచిపోయో అవకాశం ఉన్నది. సంబంధిత అధికారులు స్పందించి త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలి.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో.. వార్షిక బ్రహ్మోత్సవాలు

మైలార్‌దేవ్‌పల్లి, మే 27 : మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ టీఎన్‌జీవోస్ కాలనీ శ్రీవెంకన్న గుట్టలో కొలువుదీరిన శ్రీపద్మావతి గోదాస మేత శ్రీసాలాగ్రమ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో 7వ వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ రెండో రోజు ఉదయం ఆరాధన, సేవాకాలం, గోష్టి, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, ద్వారతోరణ ధ్వజకుంభారాధన, అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, సాయంత్రం ఆరాధన, సేవాకాలం, విష్ణుసహస్రనామ పారాయణం, పుణ్యాహవచనం, దేవతాహ్వానం, సాయంకాల నివేదన, శాత్తుమరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ఉదయాన్నే పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. మరో మూడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని కమిటీ సభ్యులు వెల్లడించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి, మే 27 : గగన్‌పహాడ్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలుఫీడర్లలో మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. లక్ష్మిగూడ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 12:30 వరకు లక్ష్మిగూడ, ఆర్‌జీకే, వాంబే కాలనీ, బృందావన్ కాలనీ, హౌసింగ్ బోర్డు, మహవీర్ ఇంజనీరింగ్ కళాశాల, పద్మశాలిపురం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1:30 నుంచి 3 గంటల వరకు పద్మశాలిపురం, మధుబన్ కాలనీ, ఆప్కో కాలనీ, సాయి కాలనీ, టీఎన్‌జీవోస్ కాలనీ, దుర్గానగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దుర్గానగర్, దుర్గా కన్వెన్షన్, శాంతినగర్, గణేశ్ నగర్, స్వప్న థియేటర్ ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా కోత విధిస్తున్నామని తెలిపారు.

మైలార్‌దేవ్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలో..

మైలార్‌దేవ్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని రహమత్ కాలనీ, జహీరాబాద్ ఫీడర్ల పరిధిలో ఉదయం 11 నుంచి 12:30 గంటల వరకు క్రిస్టల్ టౌన్, వాదే – ఈ – పర్హాన్, సుభాన్ హిల్స్, హసమాబాద్, దస్తగిరి నగర్, టవర్ గిల్లి, జహీరాబాద్, నూర్ నగర్, మిలాహత్‌నగర్, తులసీ గార్డెన్, ఐడీఏ మైలార్‌దేవ్‌పల్లి, అబ్దుల్లా కాలనీ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి 4: 30 గంటల వరకు సుభాన్ కాలనీ ఫేజ్ – 1,2, వీకర్ సెక్షన్ కాలనీ, మిలాన్ కాలనీ, హరిజన బస్తీ, పటేల్‌నగర్, రాజీవ్‌గాంధీనగర్, అబ్దుల్లా కాలనీ, రహమత్ కాలనీ ప్రాంతాల్లో కోత ఉంటుందని తెలిపారు.

శంషాబాద్ రూరల్, మే 27 : నేడు శంషాబాద్ పట్టణంలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ షేక్ బాషా సోమవారం తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పాత పోలీస్‌స్టేషన్, ఏకే టౌన్‌షిప్, బాలయేసు కాలనీ, ఏ –1 టౌన్‌షిప్, వెల్లంకి నగర్, అక్బర్ కాలనీ, హైమద్‌నగర్, బృందావన్ కాలనీ, సంజయ్ వాడ, పోచ్చమ్మగడ్డ ప్రాంతాల్లో తిరిగి 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శంషాబాద్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం, మహావీర్ బిల్డర్స్, టెలిఫోన్ కార్యాలయం ప్రాంతాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వివరించారు. ప్రజలు విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

శంషాబాద్ మండలంలో..

శంషాబాద్ మండలంలోని పెద్దషాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గండిగూడ, ఘాన్సిమియాగూడ, ఆటోనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేసి విద్యుత్ లైన్లలో ఉన్న సమస్యలను పరిష్కారం చేస్తామని ప్రజలు విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించాలని పెద్దషాపూర్ సబ్‌స్టేషన్ ఏఈ శ్రీనివాసులు తెలిపారు.

శానిటరీ నాప్‌కిన్ తయారీ యూనిట్ ప్రారంభం

శంషాబాద్‌లో శానిటరీ నాప్‌కిన్ తయారీ యూనిట్‌ను అమెజాన్ మద్దతుతో ప్రారంభించినట్లు అమెజాన్ ఇండియా కమ్యూనిటీ ఎంగేజ్‌మేంట్ లీడ్ మనీషా పాటిల్ తెలిపారు. సోమవారం చిన్నగోల్కొండలో యూనిట్ ప్రారంభం అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ మహిళలను దృష్టిలో పెట్టుకొని వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం యూనిట్ ప్రారంభించామన్నారు. గంటకు 1200 ప్యాడ్లలను తయారు చేస్తామని వివరించారు. మహిళలకు ఉపాధి కల్పించి వ్యాపారవేత్తలుగా తయారు చేశామన్నారు. మహిళ సంఘాలు, ఎన్‌జీవోల ద్వారా అవగాహన కల్పిస్తామని చెప్పారు.

- శంషాబాద్ రూరల్

మౌలిక వసతులు కల్పించాలి

విద్యానగర్‌లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కాలనీ అసోసియేషన్ సభ్యులు బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డిను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కాలనీ ఏర్పడి పదేండ్లు గడిచినప్పటికీ ఇంకా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. తాగునీరు, కరెంట్, డ్రైనేజీ, రోడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వారు వాపోయారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పెద్ద కురువ దస్తగిరి, మెట్‌పల్లి ప్రసాద్, శ్రీనివాస్ యాదవ్, రమేశ్, మహేందర్, సాయిలు పాల్గొన్నారు.

- బండ్లగూడ

హరితహారానికి.. సిద్ధంకాని తీరొక్క మొక్కలు

యూసుఫ్‌గూడ పార్కులోని నర్సరీలో ఉన్న ఒకేతీరు మొక్కలు

జూబ్లీహిల్స్, మే 27 : హరితహారం కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నాలుగు రోజుల్లో జూన్ మాసంలోకి అడుగుపెడుతుండడం.. మొదటివారంలోనే రుతుపవనాలు వచ్చే అవకాశముండడం వంటి సానుకూల సంకేతాలున్నా.. మొక్కలు మాత్రం సిద్ధం కాలేదు. జీహెచ్ఎంసీ –19వ సర్కిల్లో గతేడాది మూడున్నర లక్షల మొక్కలు లక్ష్యంగా పెట్టుకున్న అధికారులు రెట్టింపు మొక్కలు నాటారు. కృష్ణకాంత్ పార్కులో కళకళలాడాల్సిన మేజర్ నర్సరీ బోసిపోయి కనిపిస్తున్నది. ఈ ఏడాది హరితహారం కార్యక్రమం ఉండకపోవడంతో అధికారులు మొక్కలు సిద్ధం చేసుకోవడంలో ఉత్సాహం కనపరచడంలేదు అన్న వాదన వినవస్తుంది. కృష్ణకాంత్ పార్కులో ప్రస్తుతం ఉన్న మొక్కలు గతేడాదికి చెందినవని.. మొక్కలు నాటే కార్యక్రమానికి నగర శివారులోని నర్సరీ నుంచి మొక్కలు తరలించాల్సి ఉందని యూబీడీ అధికారులు తెలిపారు.

మాతా రమాబాయి వర్ధంతి

మాతా రమాబాయి వర్ధంతిని అంబేద్కర్ విగ్రహ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం బోరబండలో నిర్వహించారు. ఎస్సార్టీనగర్‌లో జరిగిన కార్యక్రమానికి విగ్రహ పరిరక్షణ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జైభీమ్ యాదగిరి, కమిటీ డివిజన్ అధ్యక్షుడు బొట్టు శివ విచ్చేశారు. రమాబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దశరథం, నారాయణరెడ్డి, విజయకుమార్, తులసీ రాం పాల్గొన్నారు.

- ఎర్రగడ్డ

గ్యాస్ రీ ఫిల్లింగ్ చేస్తున్న మహిళ పై కేసు

బంజారాహిల్స్, మే 27 : గ్యాస్ రీ ఫిల్లింగ్ చేస్తున్న మహిళపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. రోడ్ నం.12లోని ఎన్‌బీటీ నగర్‌లో నివాసముంటున్న ఎస్.సరోజ ఇంట్లో డొమెస్టిక్ సిలిండర్ల నుంచి మినీ సిలండర్ల లోకి గ్యాస్ నింపుతున్నారని సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో 6 డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు, 8 మినీ సిలిండర్లు, 7 ఖాళీ సిలిండర్లు, రీఫిల్లింగ్ కిట్స్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చెట్ల కొమ్మల తొలగింపు..

ఇటీవల వర్షాలకు విరిగిన చెట్లు, కొమ్మలను జీహెచ్ఎంసీ యూబీడీ విభాగం అధికారులు యుద్ధ ప్రాతిపదికన తొలగించే పనులు చేపట్టారు. ఆయా చెట్ల కొమ్మలతో ప్రజలు, వాహనదారులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నారు. యూబీడీ సర్కిల్ మేనేజర్ యూసుఫ్ పాషా ఆధ్వర్యంలో టెక్నికల్ అసిస్టెంట్ మహబూబ్ అలీ పనులను పరిశీలిస్తున్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో వర్షాలకు చెట్లు, కొమ్మలు పడడంతో ప్రమాదాలు చోటుచేసుకోలేదని తెలిపారు.

- జూబ్లీహిల్స్

పేదలకు సేవ చేయడంలోనే నిజమైన ఆనందం ఉంటుందని సీతాఫల్ మండికి చెందిన సంఘ సేవకుడు బంగారి సాయికృష్ణ అన్నారు. ఆదివారం రాత్రి సికింద్రాబాద్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్డుపైన నివాసం ఉంటున్న అనాథలు, నిరాశ్రయులకు భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు.

- సికింద్రాబాద్

మున్సిపల్ కార్పొరేషన్ భవనం పనులు పూర్తిచేయండి



బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన భవనాన్ని ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించిన మేయర్ లతాప్రేమ్‌గౌడ్

బండ్లగూడ, మే 27 : మున్సిపల్ కార్పొరేషన్ నూతన భవనంలో పనులను త్వరగా పూర్తి చేయాలని మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, కమిషనర్ శరత్‌చంద్ర, పలువురు కార్పొరేటర్లతో కలిసి బండ్లగూడ జాగీర్ నూతన భవనాన్ని పరిశీలించారు. మేయర్ అధికారులతో నూతన భవనంలోని ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మేయర్ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ ముగియగానే ప్రారంభించేందుకు సన్నాహాలు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఈఈ యాదయ్య, ఏఈ రాజీవ్, కార్పొరేటర్లు అస్లాంబిన్ అబ్దుల్లా, అనిత వెంకటేశ్, నిఖిలా సంగారెడ్డి, రవీందర్‌రెడ్డి, ప్రశాంత్‌నాయక్, నాయకులు సంగారెడ్డి, గోపాల్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

ముగ్గురు పాత నేరస్తుల అరెస్టు

ఖైరతాబాద్, మే 27 : ముగ్గురు పాత నేరస్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖైరతాబాద్ ఇందిరానగర్ కాలనీకి చెందిన పొదిల ప్రకాశ్ రాజ్ అలియాస్ డాలర్ పింటు, కార్వాన్ తాళ్లగడ్డకు చెందిన జాదన్ రోహన్ సింగ్ అలియాస్ ఫన్నీ రోహన్, మాదాపూర్ సాయినగర్‌కాలనీ, అయ్యప్ప సొసైటీకి చెందిన హన్మంత్ నితిన్ గౌడ్ అలియాస్ నితిన్ పాత నేరస్తులు. డాలర్ పింటుపై ఇప్పటికే ఖైరతాబాద్ పీఎస్‌లో రౌడీషీట్ ఉండడంతో పాటు సైఫాబాద్ పీఎస్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ,. సెక్షన్ 302, 341, 504, 506, 435, 290, ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసులు ఉన్నాయి. రోహన్ సింగ్‌పై జగద్గిరిగుట్ట పీఎస్ పరిధిలో సెక్షన్ 302 రెడ్ విత్ 34, సెక్షన్ 3 (2)(వి) ఆఫ్ ఎస్సీ, ఎస్టీ పీవోఏ కింద కేసులు నమోదయ్యాయి. హన్మంత్ నితిన్‌గౌడ్‌పై సైబరాబాద్, ఫిల్మ్‌నగర్ పీఎస్‌లో ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసులున్నాయి.

గంజాయి సేవిస్తూ.. యువతను టార్గెట్ చేసే క్రమంలో

ముగ్గురు రాత్రివేళ్లలో సంచరిస్తూ గంజాయి సేవిస్తూ.. యువతను టార్గెట్ చేసి అలవాటు చేసి బానిసలుగా మార్చి డబ్బులు దోచుకుంటున్నారు. అడ్డువచ్చిన వారిపై దాడి చేసేందుకు రోహన్ సింగ్ ఓ డ్యాగర్ (కత్తి) వెంట పెట్టుకొని తిరుగుతున్నాడు. వీరి ఆగడాలపై నిఘా పెట్టి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఎట్టకేలకు ముగ్గురిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కిలో వంద గ్రాముల గంజాయి, డ్యాగర్, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి ముఠా గుట్టు రట్టు చేసిన ఖైరతాబాద్ పోలీసులను సెంట్రల్ జోన్ డీసీపీ ఆకాంక్ష్ యాదవ్ అభినందించారు.

పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

చిక్కడపల్లి,మే 27 : ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. నగరంలో ప్రసిద్ధి గాంచిన చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాంనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్ దంపతులు, నాయకులు శంకర్ ముదిరాజ్, టెంపుల్ జనార్దన్, మదిగొండ మురళి, కేశవపురం అరుణ్, మాదేశి రాజేందర్, ఎర్రం శేఖర్, కల్యాణ్ నాయక్, జ్ఞానేశ్వర్‌గౌడ్, బలవంత్‌రాజ్ పాల్గొన్నారు.

స్వామి వారికి గరుడ వాహన సేవ..

బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం ఉదయం సుప్రభాతసేవ, పుణ్యాహవాచనం తదితర కార్యక్రమాలు, సాయంత్రం గరుడ వాహన సేవ నిర్వహించారు. కార్యనిర్వాహణాధికారి కె. రామాంజనేయులు, జి.శ్రీనాథ్ గౌడ్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

స్వామి వారిని దర్శించుకున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

హై 'టెన్షన్'

- పాప మృతితోనైనా రక్షణ చర్యలు తీసుకుంటారా..?

హైటెన్షన్ వైర్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

జూబ్లీహిల్స్, మే 27 : రహ్మత్‌నగర్ డివిజన్‌లో హైటెన్షన్ వైర్లతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. శుక్రవారం ఎన్ఎస్‌బీ నగర్‌లో హైటెన్షన్ వైర్ తగలడంతో విద్యుదాఘాతానికి గురైన బాలిక మృతి చెందిన విషయం తెలిసిందే. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలానికి చెందిన సహస్ర సిరి (8) వేసవి సెలవుల్లో అమ్మమ్మ, తాతయ్య దగ్గరికి వచ్చింది. చిన్నారికి హైటెన్షన్ వైర్ తగలడంతో తీవ్రంగా గాయపడి గాంధీ దవాఖానలో రెండు రోజులు మృత్యువుతో పోరాడి ఆదివారం మృతి చెందింది.

పాప మృతికి కారణమెవరు ..?

సమస్యకు కారణం తీగల కింద ఇండ్లు కట్టిన ఇంటి యజమానా.. ఇంటిపై తీగలు తొలగించని విద్యుత్ శాఖనా.. తీగలు ఉన్నా ఎత్తుగా ఇండ్లు నిర్మించేందుకు అనుమతిచ్చిన బల్దియానా..? అన్న ప్రశ్నలు సర్వత్రా తలెత్తుతున్నాయి. రహ్మత్‌నగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఇండ్లపైన 132 కె.వి. సామర్థ్యపు విద్యుత్ తీగలు ఉండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు దశాబ్దాలుగా ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటుండగా కు ఆయా ప్రమాదాల్లో 8 మందికిపైగా మృత్యువాత పడ్డట్టు.. పలువురు తీవ్ర గాయాలపాలైనట్లు స్థానికులు వాపోతున్నారు. తీగలు ఇండ్లపై పడి పైకప్పులు దెబ్బతినడం.. అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోవడం జరుగుతున్నాయి. ప్రారంభంలో చిన్న నివాసాలు ఏర్పాటుచేసుకున్న వారు అద్దెలు వస్తాయన్న ఆశతో వాటిపై ఒకటి, రెండు ఫ్లోర్లు నిర్మిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతి ఎలా ఇస్తున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అసలు అనుమతులు ఉన్నాయా.. ఇక్కడ అనుమతి లేకుండా నిర్మించిన భవనాలు తొలగించడమా.. లేదా టవర్లు మళ్లించడం చేస్తే తప్ప సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా లేదు. ఇకనైనా ప్రమాదాల బారి నుంచి ప్రజలను రక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.